# మేమే నెంబర్ వన్





- -మత విద్వేషాలతో దేశ భవిష్యత్ సంగతేంటి..?
- -నీటి కోసం ఏన్నాళ్లు ఈ కోట్లాట
- -లక్షల టీఎంసీల నీటిని సముద్రపాలవుతుంటే కేంద్రం ఏం చేస్తోంది
- -దేశ ప్రధాని స్వరాష్ట్రంలోనే 24గంటల కరెంట్ లేదు
- -24గంటల కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ
- -దద్దమ్మ పరిపాలనతో దేశ భవిష్యత్ వినాశనమైంది
- -ఎన్నికల్లో ప్రజలు గెలవాలి..ప్రజలను గెలిపించాలి
- -ప్రగతిశీల విధానాలేక్కడ..?
- -ఆశాంతి చోటుచేసుకుంటే అభివద్ధి ఎట్లుంటది
- -కేంద్రం మండిపడిన సీఎం కేఆర్
- -భద్రాద్రికొత్తగూడెంలో నూతన కలెక్టర్ భవనం, పార్టీ కార్యాలయంను ప్రారంభించిన సీఎం కేసీఆర్

(భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

భారతదేశంలో అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ మాట్లాడారు. ముందుగా హెలికాప్టర్ ద్వారా మహబూబాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెంకు చేరుకున్న సీఎం కేసీఆర్ కు జిల్లా నేతలు, అధికారులు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీఎం కేసీఆర్

మిగతా 3లో..





## 18న సీఎం చేతుల మీదుగా
# కంటి వెలుగు ప్రారంభం

-రాష్ట్ర వ్యాప్తంగా జయప్రదం చేయాలి
-వీడియోకాన్ఫరెన్స్ లో వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు



(ఖమ్మం ప్రతినిధి-విజయంన్యూస్):

ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించనున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు

మిగతా 2లో..

# అందరి చూపు ఆయన వైపే

-సీఎం పర్యటనలో స్పెషల్ అట్రాక్షన్
-నిన్న వద్దన్నరు..నేడు పక్కనే ఉంచుకుంటున్నరు..? ఏంటో సంగతి..?

(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ఆయన సామాన్య నాయకుడు కాదు.. రాష్ట్ర రాజకీయాల్లోనే కీలక వ్యక్తి.. ముగ్గురు సీఎం వద్ద మంత్రిగా పనిచేసి, 40ఏళ్ల రాజకీయ అనుభవం కల్గిన నాయకుడు.. ఐదుసార్లు గెలిచి అందులో మూడు సార్లు మంత్రిగా చేసిన అభివృద్ధి ప్రధాత.. ఆయన ఎటుంటే అటు రాజకీయాలు మారిపోతాయి.. ఆయన రాజకీయ జీవితంలో వ్యక్తిగత జీవనానికి దూరం.. ప్రజల సంక్షేమమే ఆయన లక్ష్యం అలాంటి నాయకుడే మాజీ మంత్రి తమ్మల నాగేశ్వరరావు. ఆయన ఒక్క సారి ఓటమి చెందితే.. ఆయనపై అధిష్టానం సీతకన్ను చూపించింది. నిన్నటి వరకు ఆయన్ను పట్టించుకోలేదు.. కనీసం పార్టీ మీటింగ్ లకు, జిల్లా మీటింగ్ లకు కూడా ఆహ్వానించలేదు..

మిగతా 2లో..



# అందరి చూపు ఆయన వైపే







(మొదటిపేజీ తరువాయి)

పార్టీ పదవుల్లో, ఎన్నికల్లో ఆయన అభిప్రాయాన్ని కూడా అడగలేదు.. రాజ్యసభ, ఎమ్మెల్సీ టిక్కెట్ల ఎంపిక విషయంలో అతనేవ్వరో..? అన్నట్లుగా చూశారు.. ప్రచారానికి కూడా పిలవలేదు..ఆయన రాలేదు.. ఆయన వర్గీయులపై కేసులు, జైళ్లపాలు.. జైలు వద్ద ఆ నాయకుడి అర్తనాదాలు.. ఇంత జరిగింది.. చివరి ఎవరేన్ని చెప్పిన రాబోయే ఎన్నికల్లో పోటీ తథ్యం అని తెల్చి చెప్పిన ఆ నాయకుడ్ని కట్టిపుల్లతో తీసేసినట్లుగా తీసేశారు.. ఇక తెల్చుకోవాల్సిందేనని రంగంలోకి దిగిన ఆ నాయకుడు జనవరి 1న ఆత్మీయ సమ్మెళనం కార్యక్రమం నిర్వహించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జన సమీకరణ చేశారు.. మరో వైపు రాష్ట్ర రాజకీయాలనే మార్చగల్గిన నాయకుడు ఆత్మీయ సమ్మెళనం పెట్టి ఇక పో మీ పార్టీ వద్దు.. మీరు వద్దన్నట్లుగా మాట్లాడారు. నా సత్తా ఏంటో చూపిస్తానని బహిరంగ సవాల్ చేస్తూ ప్రజలకు పిలుపునిచ్చారు. దీంతో ఉలిక్కిపడని పార్టీ అదిష్టానం.. ఖమ్మం జిల్లాపై కన్నేసింది.. ఏం జరిగిందంటే..?

ఎప్పుడులేనంత ప్రేమ ఉప్పొంగుతోంది.. ఎప్పుడు చూడనంతా అప్యాయత కనిపిస్తోంది.. వేదిక వద్దకే వద్దనుకున్న నాయకుడ్ని స్వయంగా సీఎం కేసీఆర్ వేదికపైకి పిలిచి, వెంటపెట్టుకుని వేదికపైకి వెళ్లిన పరిస్థితి.. అంతేనా.. ఆ కార్యక్రమానికి హాజరైన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విదేశాల నుంచి వచ్చిన ఆడబిడ్డ తల్లిదండ్రుల నుంచి ఎలా మురిచిపోతుందో..? తల్లిదండ్రులు ఎలా అప్యాయతానురాగాలను పంచుతారో అలా మంత్రి కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావును చూసి ఎన్నడు చూడలేదన్నంత ప్రేమను చూపించారు. అప్యాయతను కనబర్చారు. చాలా సంతోషంగా మాట్లాడుకున్నారు. ఆ తరువాత ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి తన్నీరు హారీష్ రావు నేరుగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసం గండుగలపల్లికి వెళ్లాడు.. ఒక్కడే వెళ్లాడంటే అది కాదు.. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఇటేవలే పదేపదే షెటేర్లు వేస్తూ రాజకీయ ప్రసంగం చేస్తూ సవాల్ చేస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యేను కారులో ఎక్కించుకుని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి తుమ్మల నాగేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. అక్కడ చాలా సేపు రాజకీయ కబర్లు చెప్పుకున్నారు. నీ మాటే..మా మాట అన్నట్లుగా వ్యవహరించారు.

**బహిరంగ సభలో ఆయనే అట్రాక్షన్**

ఖమ్మంజిల్లా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనేక దఫాలుగా వచ్చారు. సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు జస్ట్ కనిపించి చాలువ కప్పి సత్కరించే వెళ్లిపోయే తుమ్మల నాగేశ్వరరావు గురువారం భద్రాద్రికొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ను తుమ్మల నాగేశ్వరరావు వీడలేదు. మంత్రిగా ఉన్నప్పుడు ఎలా సీఎంతో ఉన్నారో.. గురువారం జరిగిన కార్యక్రమంలో కూడా తుమ్మల నాగేశ్వరరావు అలాగే ఉన్నారు. సీఎం కేసీఆర్ పదేపదే తుమ్మల, తుమ్మల అంటూ పిలవడం, పక్కనే నిలబెట్టించుకోవడం, పూజల వద్దకు, ప్రారంభం వద్దకు ఆయన్ను తీసుకొని సీఎం కేసీఆర్ వెళ్తుంటే తుమ్మల నాగేశ్వరరావు మరోసారి అందరికంట్లో పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రజలందరికి చూపు తుమ్మలపై పడింది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఏం జరుగుతోంది.. ఖమ్మం రాజకీయాలు ఎటువైపు దారి తీస్తున్నాయనే విషయంలో రాజకీయ నాయకులు అసక్తిగా చూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది...

**బీఆర్ఎస్ సభ కోసమేనా..?**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఖమ్మంలో బీఆర్ఎస్ బహిరంగ సభను ఎలాగైనా సూపర్ సక్సెస్ చేయాలని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి హరీశ్ రావ్ తుమ్మల నాగేశ్వర్ రావ్ ఇంటికెళ్లి కలవడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.సీఎం కేసీఆర్ పర్యటన రోజున ఆయన పక్కనే నిలబడటం, ఆయనతో కలిసి సీఎం నడవడం చూస్తుంటే రానున్న రోజుల్లో తుమ్మలకు సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టేనా..? అనే చర్చజరుగుతోంది.. పాలేరు టిక్కెట్ ఇస్తానన్నారా..? లేదంటే బహిరంగ సభ సక్సెస్ వరకే కొంత రాజకీయ ప్రయోగం ఉపయోగిస్తున్నారా..? అనేది ఎవరికి అర్థం కావడంలేదనిపిస్తోంది.. చూద్దాం రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు జరుగుతాయో..?



## 18న సీఎం చేతుల మీదుగా

# కంటి వెలుగు ప్రారంభం

కంటి వెలుగును సీఎం కేసీఆర్ ప్రారంభించిన వెంటనే అన్ని జిల్లాల్లో కంటి పరీక్షలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం సాయంత్రానికి కంటి పరీక్ష పరికరాలు, కళ్లద్దాలు పీహెచ్‌సీలకు చేరాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమన్వయం చేసుకోవాలని సూచించారు.స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.పరీక్ష బృందాలకు అవసరమైన సౌకర్యాలు స్థానికంగా కల్పించాలని వివరించారు.ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేత మహంతికి రిపోర్టు చేయాలని స్పష్టం చేశారు. బృందాలు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఒకసారి వాట్సప్ లో అప్డేట్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాలు, ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లెక్సీలు, బోర్డులు ఎక్కడికక్కడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్ వేర్ ద్వారా స్క్రీనింగ్ నిర్వహణ ఉంటున్నందున సాంకేతిక సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.

**విడతల వారీగా 16,533 లొకేషన్స్ లో క్యాంపులు**

విడతల వారీగా 16,533 లొకేషన్స్ (రూరల్ –12,763, అర్బన్ –3,788)లో క్యాంపులు నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమికంగా 30లక్షల రీడింగ్ గ్లాస్, 25 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారికి ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అధికారులు ప్రతిరోజూ క్యాంపులు సందర్శించాలన్నారు.


## సాయి విద్యానికేతన్ లో సంక్రాంతి వేడుకలు



**ఏన్కూర్, జనవరి 12 (విజయం న్యూస్)**

ఏన్కూర్ లోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరిపారు. రైతు వేషధారణ, హరిదాసు వేషధారణ తో విద్యార్థులు అలరించారు. వరి పంట పండించడం, వరి ధాన్యం ఆరబోయటం, వరి కుప్పలు నూర్పటం, తదితర అంశాలను ప్రదర్శనల ద్వారా సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు కళారూపాల ద్వారా పండగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



**ఏన్కూర్, జనవరి 12 (విజయం న్యూస్)**

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శమని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొవ్వూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మారావుపేట, బురద రాఘవాపురం, రాజలింగాల, ఏన్కూరు తదితర గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని మండల బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాందాస్, వంశీకృష్ణ, రవి, సుధాకర్, రంగోజి పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నల్లబోతుల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గర్భిణీలకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. తిమ్మారావుపేట లో జరిగిన కార్యక్రమంలో జిల్లా సేవ భారతి అధ్యక్షులు మోతుకూరి నారాయణరావు, రామకృష్ణ, గోపి, హరికృష్ణ, నరసింహారావు, కోటేశ్వరరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.


## కంటి వెలుగుపై విస్తృత ప్రచారం చేయాలి




**ఏన్కూర్, జనవరి 12 (విజయం న్యూస్)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎంపీపీ ఆర్ ఎం వరలక్ష్మి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కంటి వెలుగు కార్యక్రమ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ... ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమం గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృత ప్రచారం చేసి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బాదావత్ బుజ్జి, మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, తాసిల్దార్ ఖాసీం, డాక్టర్ రాములు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మేమే నెంబర్ వన్



(మొదటిపేజీ తరువాయి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కొబ్బరికాయ కొట్టి జిల్లా కలెక్టర్ ఛాంబర్ ను సీఎం ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ ను కుర్చీలో కూర్చోబెట్టి, పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ సీఎం కేసీఆర్ కి దేవతాప్రతిమను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ తో పాటు మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, కవితా నాయక్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర రెడ్డి, తాతా మధుసూధన్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర రావు, రేగా కాంతారావు, రాములు నాయక్, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వర రావు, బాల్క సుమన్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి, సీఎం సెక్రటరీ స్మితా సబర్వాల్, జెడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మినారాయణ, పూల రవిందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డి. రాజేందర్, డిసిసిబి ఛైర్మన్ కె.నాగభూషణం, కలెక్టర్ అనుదీప్, ఆర్ అండ్ బి ఈఎన్సీ గణపతి రెడ్డి, నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం :

బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకున్న సీఎం కేసీఆర్ కి పండితులు వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని, బీఆర్ఎస్ పార్టీ జెండాను సీఎం ఆవిష్కరించారు. బిఆర్ఎస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును సీట్లో కూర్చోబెట్టి సీఎం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఏం మాట్లాడారో.. ఆయన మాటల్లో.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఈ రోజు రాష్ట్రంలోనే అత్యద్భుతమైన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించుకున్నందుకు యావత్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలను, అధికారులను అభినందిస్తున్నాను. ప్రజలకు మేలు చేసే పవిత్రమైన దేవాలయంలాగా ఈ కార్యాలయం పనిచేయాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడింది. కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చింది. మెడికల్ కాలేజీ వచ్చింది. ఇక్కడే భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వచ్చింది. ఇంకా చాలా చాలా వచ్చాయి. భవిష్యత్ లో ఇంకా వస్తాయి.సింగరేణి కొత్తగూడెం నుండే విస్తరించి ఈ రోజు అద్భుత ఆదాయ వనరుగా, ఉద్యోగాల వనరుగా సింగరేణి సిరుల కల్పవల్లిగా మన తెలంగాణ కొంగుబంగారంగా నిలిచిన గడ్డ మన కొత్తగూడెం ఇల్లందు గడ్డ. భద్రాద్రి కొత్తగూడెం ప్రజాచైతన్యం ఉన్న జిల్లా. కమ్యూనిస్టు విప్లవభావాలతో అనేక రకాల ఉద్యమాల్లో పాల్గొంటూ, అద్భుతమైన ప్రగతిశీల కార్యక్రమాలను ఈ ప్రాంతం చేపట్టింది.నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసులు నన్ను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెడితే ఇదే ఖమ్మం జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేసి కడుపులో పెట్టుకున్నందుకు ధన్యవాదాలు మీ అందరి ఆశీర్వాద బలం, ఐక్య పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది ఏడున్నర ఎనిమిదేండ్ల క్రితం ఉన్న తెలంగాణకు నేటి తెలంగాణకు అసలు పోలిక, పొంతన లేదు ఆనాడు మన తలసరి ఆదాయం రూ.87 వేలు, ఈనాడు మన తలసరి ఆదాయం రూ.2.78లక్షలు. ఆనాడు మన జీఎస్డీపి కేవలం 5 లక్షల కోట్ల రూపాయలు. ఈనాడు మన జీఎస్డీపి రూ.11.5 లక్షల కోట్లు. భారతదేశంలోనే తలసరి విద్యుత్ వినియోగంలో నెంబర్ వన్ స్టేట్ తెలంగాణ. 33 జిల్లాల్లో జిల్లా పరిపాలన కేంద్రాలతో పాటు మెడికల్ కాలేజీలను కూడా మంజూరు చేసుకున్నాం. అందులో భాగంగానే కొత్తగూడెం జిల్లాకు కూడా మెడికల్ కాలేజీ వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నది.కులాలు, మతాలు, వర్గాలకు భిన్నంగా సమాజాన్ని దేవాలయంగా భావించి అందరి సంక్షేమాన్ని కాంక్షించి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.కేసీఆర్ కిట్ ను పేదింటి మహిళల క్షేమాన్ని కాంక్షించి పూర్తి మానవీయ కోణంలో అమలు చేస్తున్నాం. ప్రజల నుండి డిమాండ్లు లేకపోయినా అద్భుతమైన కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.

అన్ని రంగాల్లో దూసుకపోతున్నం రాష్ట్రం తెలంగాణ : సీఎం కేసీఆర్

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. కాళేశ్వరం పూర్తి చేసుకోవడంతో పాటు, ఖమ్మం జిల్లాలోని ప్రతీ ఇంచుకు నీరు వచ్చే విధంగా సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టుకున్నాం. ఇది పూర్తయితే ఖమ్మం జిల్లా యావత్తు సస్యశ్యామలమవుతుంది. భద్రాద్రి దేవాలయానికి సమీపంలోనే 37 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో సముద్రాన్ని తలపించే విధంగా సీతమ్మవారి ఆనకట్ట కట్టుకుంటున్నాం. మిషన్ భగీరథతో ప్రతీ గ్రామానికి, తండాకు, కోయగూడానికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నాం. మనిషి పుట్టినప్పటి నుండి మరణించేవరకు ఏదో రకంగా సహాయం అందే విధంగా కార్యక్రమాలను అమలుచేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యేల సహకారంతో పేదలకు సాయం అందుతున్నది.

వనమాపై ప్రశంసల జల్లు

ఎమ్మెల్యే వనమా వేంకటేశ్వర్ రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం చాలా కృషి చేస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కొత్తగూడెం పట్టణానికి ముర్రేడు వాగు వరద బాధను తొలిగించేందుకు ఎంత ఖర్చయినా పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. వారం పది రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. కొత్తగూడెం జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి గ్రామానికి రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నాను. వెంటనే ఆ నిధులు అందుబాటులోకి వస్తాయి. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల అభివృద్ధికి ఒక్కో మున్సిపాలిటీకి రూ. 40 కోట్ల చొప్పున, ఇల్లందు, మణుగూరు మున్సిపాలిటీల అభివృద్ధికి ఒక్కో మున్సిపాలిటీకి రూ. 25 కోట్ల చొప్పున ప్రత్యేక ఫండ్ ను మంజూరు చేస్తున్నాం. త్వరలోనే ఈ నిధులను విడుదల చేస్తాం. ఇక్కడి మైనింగ్ ఇన్సిట్యూట్ ను ఇంజనీరింగ్ కాలేజీగా ప్రకటించారు. ఇది సమగ్రంగా లేదు. దీన్ని పూర్తిస్థాయి ఇంజనీరింగ్ కాలేజీగా అభివృద్ధి చేస్తాం.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిస్తాం: సీఎం

అంతకుముందు ఇండ్ల స్థలాల మంజూరులో స్థలాలు రాని జర్నలిస్టులకు సింగరేణి స్థలంలో కేటాయించేందుకు త్వరలో కార్యాచరణ చేపడతాం. ఒక భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోనే కాదు అంతట జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

దేశంలోనే బెస్ట్ జీఎస్డీపీ తెలంగాణలోనే

ఎనిమిదేండ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తర్వాత మన రాష్ట్ర జీఎస్డీపిని రూ.5 లక్షల కోట్ల నుండి రూ.11.5 లక్షల కోట్లలకు పెంచుకున్నాం. అదే సమయంలో కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి పార్టీ అనుసరించిన అసంబద్ధ, దుర్మార్గపూరిత విధానాల వల్ల మనకంటే గొప్పగా కాదు కనీసం మన స్థాయిలో పనిచేసినా మన రాష్ట్ర జీఎస్డీపి రూ.14.50 లక్షల కోట్లుండేది. అంటే ఒక్క మన తెలంగాణ రాష్ట్రమే రూ.3 లక్షల కోట్లు కోల్పోయింది. ఒక రాష్ట్రమే ఇంత కోల్పోతే మిగతా దేశమంత ఎంత నష్టపోయుంటుంది. అదే మాట నేను అసెంబ్లీలో కూడా చెప్పాను. ప్రజలు దీని పై ఆలోచన చేయాలి.

దేశంలో విద్వేషం రగిలిస్తే

ప్రజలందరినీ కడుపులో పెట్టుకొని చూసుకోవాల్సిన కేంద్రం ప్రజలను విడదీసి, మతచిచ్చు పెట్టి, కులాల కుంపట్లు పెట్టి ద్వేషం రగిలిస్తే ఆ విషవృక్షాలు ఎవరిని దహించి వేస్తాయి.? జాతి జీవనాడి కలుషితం కాదా? దేశంలో తాలిబన్ సంస్కృతి రాజ్యమేలితే పెట్టుబడులు వస్తాయా..? ఉద్యోగాలు ఉంటాయా...? ఉన్న పరిశ్రమలు నిలబడి ఉంటాయా..? అశాంతిని రాజేస్తే కర్ఫ్యూలు, లాఠీఛార్జీలు, ఫైరింగ్ ల్లాంటి వాతావరణం ఉంటే సమాజం ఎంత భ్రష్టుపట్టపోతుంది.? ఇదంతా మీరు గమనిస్తూనే ఉన్నారు.

నేను మీతో విన్నవించేదేంటంటే ....

దయచేసి మీరు మీ మీ ఇండ్లకు, బస్తీలకు, గ్రామాలకు వెళ్ళిన తర్వాత పెద్దలతోని 10 నిమిషాలు ఈ విషయం పై చర్చ పెట్టమని నేను కోరుతున్నాను. మీరు ఇలా చేస్తే ఒక దీపంతో మరో దీపం వెలిగించినట్టుగా చైతన్యం వెల్లివిరిసి దేశానికి మేలు జరుగుతుంది.తెలంగాణ మంచిగున్నది అనుకుంటే సరిపోదు. దేశం మొత్తం బాగుంటేనే మనం కూడా బాగుంటాం.దేశ పురోభివృద్ధిలోనే మన పురోభివృద్ధి కూడా ఉంటుంది.

ఎందుకు ఈ కోట్లాట..?

ఈ దేశంలో రాష్ట్రాల మధ్య నీటియుద్ధాలు జరుగుతుంటాయి. ఎందుకు ఈ కొట్లాట ? నీళ్ళు లేకనా ? ఈ రోజు ప్రపంచంలోనే అత్యధికంగా వ్యవసాయానుకూల భూమి ఉన్న ఒకే ఒక్క దేశం భారతదేశం. భౌగోళికంగా





మనకంటే పెద్ద దేశమైన అమెరికాలో వ్యవసాయానుకూల భూమి 29 శాతమే, చైనాలో 16 శాతమే ఉంది. భారత భూభాగాన్ని ఎకరాల్లో కొలిస్తే 83 కోట్ల ఎకరాలుంటుంది. దీంట్లో 41 కోట్ల ఎకరాలు అద్భుతమైన పంట పండే భూములున్నాయి. భారతదేశంలో అద్భుతమైన మూడు రకాల ఆగ్రో క్లైమేటిక్ వాతావరణ పరిస్థితులున్నాయి. మనకు అద్భుతమైన సూర్యకాంతి, అద్భుతమైన జలసంపద మాత్రమే కాక 139 కోట్ల మానవ సంపద (జనాభా) ఉంది. మనదేశంలో 1 లక్ష 40 వేల టిఎంసిల వర్షం కురిస్తే అందులో 70 వేల టిఎంసీలు ఆవిరైపోతే, మిగతా 70 వేల టిఎంసిలు నదుల్లో కలుస్తున్నాయి.

మనదేశంలో ఇప్పటిదాకా వాడుతున్నది కేవలం 20 వేల టిఎంసిలు మాత్రమే. మిగిలిన 50 వేల టిఎంసిలు సముద్రంపాలవతున్నాయి. మరి నీటి యుద్ధాలు ఏ కారణం చేత జరుగుతున్నాయి ? దుర్మార్గపు కేంద్ర ప్రభుత్వ విధానాలు, చెత్త వాటర్ పాలసీల వల్ల రాష్ట్రాలకు తగవులు పెట్టి నాటి కాంగ్రెస్ నుండి నేటి బిజెపి వరకు ఎవరు పరిపాలించినా ఇదే మాదిరి ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. మన రాష్ట్రంలోనే కృష్ణా జలాల వివాదాలను పరిష్కరించేందుకు 2004 లో ట్రిబ్యునల్ వేసిన్రు. ఈ రోజు వరకు అతీ గతీ లేదు.ఈనాటికి దేశ రాజధాని ఢిల్లీలో సరైన పద్ధతిలో నీళ్ళు రావు, కరెంటు ఉండదు. ఇది తేలిగ్గా తీసిపారేయాల్సిన విషయం కాదు. ముఖ్యంగా యువకులు, విద్యాధికులు,

దేశాన్ని రక్షించుకునేందుకే ఖమ్మం నుంచే శంఖారావం : సీఎం కేసీఆర్

దేశాన్ని రక్షించుకునేందుకు ఖమ్మం నుంచి శంఖారావాన్ని పూరించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ వాటర్ పాలసీతో రాష్ట్రాలు జట్లు పట్టుకుంటున్నాయని విమర్శించారు. 'చేబితే ప్రపంచముందు సిగ్గుపోతుంది.దేశ రాజధాని ఢిల్లీలో మంచినీళ్లు రావు. కరెంటు రాదు. ఉపన్యాసాలు వింటే టీవీలు బద్ధలైతయ్. రైతులు, విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఆలోచించాలి. దేశంలో స్థాపిత 4.10లక్షల మెగావాట్ల విద్యుత్ ఉంది. దేశ ఏ ఒక్క రోజు 2.10లక్షల మెగావాట్లకు మించి వాడలేదు. తెలంగాణలో తప్పా భారతదేశంలో ఏయే రాష్ట్రంలో, ప్రధాని సొంత రాష్ట్రం సహా 24 గంటల కరెంటు ఇచ్చే పరిస్థితి లేదు. మంచినీరు ఇవ్వరు.. సాగునీరివ్వరు.. కరెంటు ఇవ్వరు.. ఉద్యోగాలు ఇవ్వరు.. ఉపన్యాసాలు వినాలా? ఎన్ని రోజులు వినాలి?' అని నిలదీశారు. మంచినీళ్ళు, కరెంటు, సాగునీరు, ఉద్యోగాలు ఏదీ ఇవ్వరు. మరేం ఇస్తారు ? ఉపన్యాసాలే ఇస్తరా ?ఎన్నికల్లో పార్టీలు గెలుస్తున్నాయి. నాయకులు గెలుస్తున్నారు. ఇది సరైన పంథా కాదు. ఎన్నికల్లో ప్రజలు గెలవాలి. పార్టీలు కాదు. ప్రజలకు పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు నిలబెట్టి, నిలదీసే ప్రజాస్వామ్య ప్రక్రియ రానంతవరకు ఈ దేశంలో ఇదే సొల్లు పురాణాలు, ఇదే కాలక్షేపం చూస్తాం తప్ప న్యాయం జరగదు. రాబోయే రోజుల్లో మనం ఈ దేశాన్ని రక్షించుకోవాలంటే చైతన్యమున్న తెలంగాణ రాష్ట్రం నుంచే విజ్ఞాన వీచికలు భారతదేశమంతా ప్రసారం కావాలె. అందుకే ఈ నెల18వ తేదీన చాలా మంది పెద్దలతో పాటు భారీ బహిరంగ సభను చేపట్టనున్నాం. ఈ దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని నేను కోరుతున్నాను. మీ అందరి దీవెనతో ఏ విధంగానైతే తెలంగాణ రాష్ట్రంలో కుల,మత,వర్ణ,వర్గ రహితంగా మౌలిక వసతుల కల్పన, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామో అదే విధంగా అందరినీ కడుపులో పెట్టుకుని ముందుకు సాగుతాం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి కోసం శాసనసభ్యుల నుంచి వచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తాం.

కేసిఆర్ నోట ఎన్.టీ. రామారావు మాట

తెలుగువారి ఆరాధ్య దైవం, తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక విశ్వవిఖ్యాత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) నామస్మరణను తరుచుగా కేసిఆర్ చేస్తుంటారు తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ప్రారంభ సభలోనూ కేసిఆర్ వారి మాటలను ప్రస్తావించారు. నాడు ప్రజాజీవితంలో ఎన్ టీ రామారావు 'సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్ళు' గా భావించి ముందుకు సాగారు అదే రీతిలో తను కులాలు మతాలు వర్గాలకు అతీతంగా 'సమాజమే దేవాలయం' గా భావిస్తున్నట్టు కేసిఆర్ చెప్పుకొచ్చారు. దీంతో నాడు అన్న ఎన్. టీ రామారావు నినాదాన్ని కేసిఆర్ మరో సారి గుర్తుచేశారని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తన రాజకీయ గురువు ఎన్ టీ రామారావు గారిని కేసిఆర్ అనునిత్యం తలుస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొంటున్నా

# అంగరంగ వైభవంగా జిల్లా సమీకృత భవనాలు ప్రారంభం

## హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్ అనుదీప్






భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో (విజయం ప్రతినిధి )
రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేతుల మీదుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయపు భవనం అంగరంగ వైభవంగా ప్రారంభించుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ అనుదీప్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జడ్పి చైర్మన్ తదితర ఇతర ప్రజాప్రతినిధులు, సీఎస్ డా శాంతి కుమారి, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ హాజరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఆసాంతం దిగ్విజయంగా నిర్వహించుటలో సహకరించిన జిల్లా ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయులకు, జిల్లా ప్రజలకు, అధికారులకు అనధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. నూతన కలెక్టరేట్ భవనం అద్భుతంగా నిర్మించుకున్నారని ఎటుచూసినా పచ్చని వాతావరణ కనిపిస్తుందని సీఎం అభినందించడం చాలా సంతోషమని చెప్పారు. నేటి నుండి అన్ని శాఖలు ఒకే సముదాయంలోకి రానున్నాయని, తద్వారా జిల్లా ప్రజలకు సుపరిపాలన అందుబాటులోకి రానున్నదని చెప్పారు. అన్ని శాఖలు ఒకే సముదాయంలో ఉండటం వల్ల ప్రజలకు సేవలు మరింత చేరువ కానున్నాయని చెప్పారు. ప్రజలకు కూడా ఎంతో సౌలభ్యత ఉంటుందని, గతంలో వేరు వేరు చోట ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం వల్ల ప్రజలు అన్ని శాఖలకు తిరగాల్సిన పరిస్థితి ఉండేదని నేడు అటువంటి అవసరం లేకుండా ఒకే సముదాయంలో ఉన్నందున వారి సమస్యలు పరిష్కరించడానికి సులువుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తద్వారా సమస్యలు వేగవంతంగా పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందని జిల్లా ప్రజలకు కూడా ఎంతో సౌకర్యం ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోనే జిల్లా అధికారుల నివాస స్థలాలు కూడా నిర్మించుకున్నామని, జిల్లా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండే అవకాశం ఉన్నదని ఇది ప్రజలకు ఎంతో అనుకూలతగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నేటి నుంచి అధునాతన అంగులతో సువిశాలమైనటువంటి భవనంతో పాటు పచ్చని చెట్లు, పూలవనంతో నిండి ఉన్నటువంటి కలెక్టరేట్ జిల్లా ప్రజలకు అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో వైభవంగా సంక్రాంతి పండుగ సంబరాలు

**సత్తుపల్లి, జనవరి 12:**
మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో బిటెక్ అన్ని బ్రాంచీలు,డిప్లొమా,యంబిఎ విద్యార్థినీ,విద్యార్థులు మరియు సాయిస్ఫూర్తిసేవాసమితి వారి సంయుక్తాధ్వర్యంలో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి డాక్టర్:పూటుకూరి.శేషారత్నకుమారి గారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ యొక్క ఔనత్యాన్ని వివరిస్తూ సంక్రాతి అనగా సూర్యుడు రాశిలో ప్రవేశించడం అని ఈ పండుగ 3రోజులు పాటు జరుపుకుంటారని మొదటి రోజున సాధారణంగా ప్రతిసారి జనవరి 14న జోగి పండుగ జోగి మంటలతో ప్రారంభం అవుతుంది.రెండవ రోజున సంక్రాంతి అని ఈ రోజు పాలు పొంగించి దానితో మిఠాయిలు తాయారు చేయడం,అరిసెలు,బొబ్బట్లు,జంతికలు,చక్కినాలు,సేమియాపాయసం,పరమాన ్నం,గారెలు మొదలగు వంటకాలు తయారు చేసుకొని నూతన వస్త్రములు ధరించి పండుగను ఆస్వాదిస్తారని చెప్పారు.అంతేకాకుండా మూడవ రోజున కనుమ దీనికి ఒక ప్రత్యేకత ఉంది. రైతులు వ్యవసాయంలో తమకు ఎంతో ఉపయోగకరంగా ఉండే పశువులను శుభపరచి వాటికి పూజలు చేయడంతో పాటు వాటికీ శుభాకాంక్షలు తెలుపుతారని వివరించారు. ఆయితే దక్షణ భారతదేశంలోని ప్రజలు ఈ పండుగను మూడురోజులు శ్రద్ధాసక్తులతో జరుపుకోవడం జరుగుతుంది.దీనిని పురస్కారించుకొని కళాశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు(రంగోలి)నిర్వహించటం జరిగింది. ఈ ముగ్గుల పోటీల ఏర్పాటుతో రంగు రంగుల ముగ్గులతో కళాశాల వాతావరణం ఆహ్లాదకరంగా మారిందని ఈ పోటీల్లో బాలికలతో పాటు బాలురు కూడా పాల్గొన్నడం విశేషంగా చెప్పవచ్చున్నారు. మరో విశేషం జాతీయ యువజనోత్సవం సందర్భముగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో యువశక్తి పోటీలలో 3వ సంవత్సరం విద్యార్థి నాగం సూర్యనారాయణ వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించాడు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్స్, సంప్రదాయ వస్త్రధారణతో కళాశాల ప్రాంగణం నిండిపోయింది. దీనికి భాద్యులుగా %వీ% సుమలత, కె.స్వాతి, యస్.జ్యోతి, వి.సుష్మ, రాచమళ్ళ శ్రీదేవి, కె.వాసవి, లీలావతి, శైలజ వున్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయకుమార్, కళాశాల చీఫ్ కౌన్సిలర్ శ్రీ కోటగిరి వెంకటజవహర్, అన్ని బ్రాంచీల విభాగాధిపతులు, కళాశాల ట్రైనింగ్ %డ% ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ డియన్ వి.కృష్ణారెడ్డి, ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు

## రవీంద్ర పబ్లిక్ స్కూల్ లో ముగ్గుల పోటీలు.

అశ్వాపురం, జనవరి 12,(విజయం న్యూస్)
సంక్రాంతి పండగ సందర్భంగా మండల కేంద్రంలోని రవీంద్ర పబ్లిక్ స్కూల్ లో గురువారం విద్యార్థులకు , ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముత్తినేని సుజాతను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ దొడ్డ రమేష్, ఉపాధ్యాయులు ఉషశ్రీ, కవిత, కుసుమ, గీత, ఫాతిమా, పల్లవి, జ్యోతి, అనుషా,రుధా, విద్యార్థులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం.



**అశ్వాపురం, జనవరి 12, (విజయం న్యూస్)**
మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన గుంజాల కృష్ణ పూరీల్లు జనవరి 1న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. గురువారం గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదం లో కాలిపోయిన గుంజాల కృష్ణ కుటుంబానికి గురువారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

## ముగ్గుల పోటీల విజేతలు వీరే



**ఏన్కూర్, జనవరి 12 (విజయం న్యూస్)**
ఏన్కూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతులను మౌనశ్రీ, నిహారిక, మనస్విని, విహారి, కీర్తి లు గెలుపొందగా, సీనియర్ విభాగంలో గీతాంజలి, ధరణి, నవ్య శ్రీ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శైల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## స్వామి వివేకానంద సిద్ధాంతాలు యువతరానికి ఆదర్శం కావాలి




**తిరుమలాయపాలెం, జనవరి 12 (విజయం న్యూస్)**
తిరుమలాయపాలెం మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో స్వామి వివేకానంద నేటి యువతరానికి కావాలని వివేకనంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్ లైన్స్ నుండి కే సత్య ప్రకాష్ రాయి పేర్కొన్నారు గురువారం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ శక్తివంచలేకుండా కృషి చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ పి ఓ బి రామయ్య, జికేసి మౌళి పి నారాయణ రావు, కే నరసింహారావు, కీర్తి పాల్గొన్నారు

## సన్నాహక సమావేశ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, జనవరి 12:
ఖమ్మంలో ఈ నెల 18న సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం, జాతీయ బిఆర్ఎస్ పార్టీ తొలిసారిగా నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గారి ఆధ్వర్యంలో నేడు శుక్రవారం నాడు ఉదయం 10గంటలకి సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డు నందు గల మెట్ట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని కొత్తూరు ఉమామహేశ్వరావు తోటలో సత్తుపల్లి పట్టణ, రూరల్, వేంసూరు మండలాల బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆరోగ్య మరియు ఆర్థిక శాఖ మాత్యులు తన్నీరు హరీష్ రావు, బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథి రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొననున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశ కార్యక్రమలలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు ఆయా మండల పరిధిలోని గ్రామాల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, డిసిసిబి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆత్మ డైరెక్టర్లు, అధ్యక్షులు కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పట్టణ వార్డు కౌన్సిలర్లు, వార్డు కమిటి అధ్యక్ష, కార్యదర్శులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి చేశారు.

# భారత సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

**పండుగలు ప్రజల మధ్య స్నేహాన్ని పెంపొందించాలి.**

**మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**బాబూక్యాంపు, శేషగిరినగర్లో ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు**






భద్రాద్రి కొత్తగూడెం జనవరి 12(విజయం ప్రతినిధి ):- భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, భిన్నత్వంలో ఏకత్వం చాటుతున్న పండుగల ఉత్సవాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను చేరిపేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాజీ ఎంపిపిటీసీలు, సిపిఐ నాయకులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, దుర్గరాశి లక్ష్మి ఆధ్వర్యంలో బాబూక్యాంపు ఏరియాలో, సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో లక్ష్మి దేవిపల్లి మండల పరిధిలోని శేషగిరినగర్లో ఉల్లాసంగా మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాశ్యాత్య పోకడలకు దూరంగా ఉంటూ తెలుగు సంస్కృతిని సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం నేటితరం యువతీ, యువకులకు ఉందన్నారు. నైపుణ్యతను ప్రదర్శించడానికి చక్కని వేదికగా ముగ్గుల పోటీలు నిలుస్తాయని, కుటుంబాల మధ్య స్నేహ బంధం పెంపొందుతుందన్నారు. మహిళలు సమాజ పోకడలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని, మహిళా రక్షణ చట్టాల అమలు, ప్రభుత్వ హామీల సాధనకోసం ఉద్యమాలవైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పాలక ప్రభుత్వాలు పదే పదే వల్లే వేస్తున్న మహిళా సాధికారత ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారన్నారు. మహిళా చట్టాలు, హక్కుల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, మహిళలు ఏకమై 33శాతం రిజర్వేషన్, సాధికారత, చట్టాల అమలుకోసం ఐక్యంగా ఉద్యమించాలని, మహిళలను ఓటు బ్యాంకుగానే చూస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించి పండుగ శుభాకాంక్షలు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, దుర్గరాసి వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర, జిల్లా నాయకులు మున్నాలక్ష్మి కుమారి, ఏపూరి లతాదేవి, కె.చంద్రకళ, వి.పద్మజ,కె.రత్నకుమారి, దుర్గరాసి లక్ష్మి, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, గుండు శ్రీను, నాయకులు, ప్రజాప్రతినిధులు బాదావత్ సుగుణ, కోటి, అమ్ములు, కృష్ణయ్య, రాంజి, బాగం మహేశ్వర్రావు, మద్దెల విజయలక్ష్మి, షాహెన్, పి. ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బోదకాలు ( ఫైలేరియా) వ్యాధిగ్రస్తులకు2016/- నుంచి 5000/రూ/గా పెన్షన్ పెంచాలి

**తిరుమలాయపాలెం, జనవరి 12 (విజయం న్యూస్)**

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర జరిగిన బోదకాలు బాధితుల సమావేశానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల నాయకులు బచ్చోడు గ్రామ పార్టీ కార్యదర్శి వెన్నబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తిమ్మిడి హనుమంతరావు మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్రంలో బోదకాలు (ఫైలేరియా) వ్యాధితో ఎంతోమంది బాధపడుతున్నారని అలాంటి వారికి సరైనటువంటి వసతులు గాని పెన్షన్ కానీ సరిపోవటం లేదని బోదకాలు వ్యాధిగ్రస్తులకు 2016/-రూపాయల నుండి 5000 రూపాయల వరకు పెన్షన్ పెంచాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తిమ్మిడి హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోదకాలు బాధితులకు ఉచితంగా నెలకు 10 కేజీల బియ్యం, కేజీ మంచి నూనె, కేజీ పప్పు, కేజీ కారం, పావు కేజీ పసుపు, చింతపండు, బట్టల సబ్బులు సర్ఫ్ ప్యాకెట్లు స్నానం సబ్బు లు అన్ని రకాల నిత్యవసర వస్తువులతో పాటు బకెటు,జగ్గు. దోమ తెరలు, ఉచిత మందులు, శానిటైజర్లు, బట్టలు, దుప్పట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి అందజేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ (చంద్రన్న వర్గం) తిరుమలాయపాలెం మండల కమిటీ డిమాండ్ చేస్తున్నాం. బోదకాలు బాధితులతో పాటు ( లెప్రసి )కుష్టు వ్యాధి, ఎయిడ్స్, క్యాన్సర్, షుగర్ బాధితులను కూడా ప్రభుత్వం గుర్తించి వికలాంగులుగా సదరం సర్టిఫికెట్లు ఇచ్చి పై వస్తువులతో పాటు ఐదు వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలని వితంతులుగా ఉన్న వారిని వృద్ధాప్యంగా ఉన్న వారిని కూడా బోదకాలు బాధితులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పాలేరు శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి,ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామ నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ తాత




మధుసూదన్ తీసుకెళ్లి బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని. ఫైలేరియా ప్రాజెక్టు బచ్చోడు కేంద్రంలో ఏర్పాటు చేయాలని తిమ్మిడి హనుమంతరావు అన్నారు. స్థానిక సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు చొరవ తీసుకొని వచ్చే విధంగా చేయాలని అన్నారు. 23 జనవరి 2023న ఉదయం 11 గంటలకు తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో ఆఫీస్ నందు జరుగు ధర్నా ప్రదర్శన ఉంటుందని ఈ కార్యక్రమానికి అందరూ పాల్గొనాలి విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బోదకాలు బాధితులు పసలాది వెంకటమ్మ, వెన్న బోయిన బూబమ్మ, గొర్రెపాటి పూలమ్మ, మల్లె బోయిన కోటయ్య, నందిపాటి నీలమ్మ, బొల్లం విజయ, బొల్లం పిచ్చమ్మ, చిట్టి మాల వీరమ్మ,గుజ్జ మాణిక్యమ్మ, రాములమ్మ, అంగిరేకుల గురవమ్మ,,గొర్రెపాటి బుచ్చమ్మ,గొర్రె పాటి నాగమ్మ, జుజ్జూరి నర్సమ్మ, పేరం శాంతమ్మ, గొర్రెపాటి శ్రీను, జనక భద్రమ్మ, గొర్రెపాటి సత్యనారాయణ, రామచంద్రు, దుండి ప్రవీణ్, బుర్ర వెంకన్న,చింతల అశోక్ తదితరులు పాల్గొన్నారు

## మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చంద్రుగొండ, జనవరి 12(విజయం న్యూస్ ): మున్నూరుకాపు సంఘం-2023 క్యాలెండర్ ను ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ... సంఘం ఐక్యత కోసం కృషి చేయాలని, ఇకపై సంఘం బలోపేతానికి ప్రతి యొక్కరు కృషి చేయాలన్నారు. పేదలకు సహాయపడటంతో సంఘం ఇకపై క్రీయాశీలంగా పనిచేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు లంకా నరసింహరావు, సంఘం బాధ్యులు పులి సత్యం, పసుపులేటి వెంకటేశ్వర్లు, చలవాది రామారావు, మక్క రమేష్, పసుపులేటి రాధక్రిష్ణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, రంగిశెట్టి నరేష్, అంచ అప్పారావు, రామిశెట్టి సుబ్బారావు, అంచ క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లి, జనవరి 12:

ఉదయం 9 నుండి 2 వరకు గంగారం 132/33 కేవీ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయనున్నట్లు డీఈ ఎల్ రాములు తెలిపారు. గంగారం 33 కేవీ ఫీడర్ పైన వున్న గంగారం, కిష్టాపురం, పాకల గూడెం సబ్ స్టేషను ల పరిధి లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అదేవిధంగాబవేంసూరు మండల పరిధిలో ఉన్న 6సబ్ స్టేషన్లు గూడూరు, రాయుడు పాలెం, బీరపల్లి,కందుకూరు,వేంసూర్, లింగ పాలెం పరిద్ఇలో సింగిల్ ఫేజ్ సప్లై మాత్రమే ఇవ్వబడును.విద్యుత్ వినయోగదారులు సహకరించగలరని కోరారు.

## స్వామి వివేకానంద సిద్ధాంతాలు, బోధనలు యువతరానికి ఆదర్శం కావాలి:- ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, జనవరి 12:

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని సత్తుపల్లి పట్టణంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గారు పాల్గొని మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించా.రు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గారు మాట్లాడుతూ ఆయన భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. స్వామి వివేకానంద ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు

## సీఎం పర్యటన నేపథ్యంలో బిజెపి/కాంగ్రెస్ నాయకులు ముందస్తు అరెస్టులు.





అశ్వాపురం, జనవరి 12, (విజయం న్యూస్)

జిల్లా లో గురువారం సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, కలేటి వీరయ్య, బొల్లినేని సురేష్ మల్లెం కరుణ్, బిజెపి మండల అధ్యక్షుడు తాటిపాముల ఐలయ్య, వెంకట్ రెడ్డి, కొల్లు లింగారెడ్డి, గోసుల రాములు, కోలా భాస్కర్, బండ్ల నాగేశ్వరరావు లను అరెస్టు చేశారు.

## సంక్రాంతి పండుగ సాంప్రదాయాలకు ప్రతీక

చంద్రుగొండ , జనవరి 12( విజయం న్యూస్ ): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అని సెయింట్ జోషప్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొమ్మలా అన్నారు. గురువారం స్థాయిక సెయింట్ జోషన్ పాఠశాలలో సంస్కృతి పండుగను. ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన పండుగల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, సుజాత, మునీర్, రాణి, భాస్కర్, నరేష్, అనూష, సిస్టర్ గా, రేష్మా, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ప్రయోజనార్థంకోసమే 'సిటిబస్టాండ్'

**ఖమ్మం సిటీ బస్ స్టాండ్ ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ**

**ధన్యవాదాలు తెలుపుతూ మంత్రిని సన్మానించిన వ్యాపారులు, ప్రయాణికులు**







(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ప్రజల ప్రయోజనార్థం పాత బస్టాండ్ ను సిటి బస్టాండ్ గా మార్చడం జరిగిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పాత బస్టాండ్ ప్రాంగణం ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలనే ఉద్దేశంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు రోడ్డుపై ఉండాల్సి వస్తుందని, అందుకే ప్రయాణికుల ప్రయోజనార్థం సిటి బస్టాండ్ గా మార్చడం జరిగిందన్నారు. అలాగే వ్యాపారులు బస్టాండ్ లేకపోవడం వల్ల వ్యాపారాలన్ని కనుమరుగు అయ్యాయని, వ్యాపారులను కాపాడాలని స్థానిక వ్యాపారులు కోరడం జరిగిందన్నారు. ఖమ్మం పాత బస్ స్టాండ్ ను ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సంకల్పించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం సిటీ బస్ స్టాండ్ గా మార్చి గురువారం దానిని లాంఛనంగా ప్రారంభించారు. ఎంతో చరిత్ర కలిగిన ఖమ్మం బస్టాండ్ ను రూ.50 లక్షలతో ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని మంత్రి పువ్వాడ అన్నారు.అనంతరం సిటీ సర్వీసెస్ లను జెండా ఊపి ప్రారంభించారు. పాత బస్టాండ్ ను పునరుద్ధరణ చేయడం పట్ల స్థానిక వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం ఖమ్మం వచ్చే ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ భారీ గజ మాలలతో మంత్రి అజయ్ కుమార్ ని సత్కరించారు. వారి వెంట ఎంపి నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

# సీఎం పర్యటన పకడ్బందిగా నిర్వహించాలి

**ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలి**

**అధికారులకు సూచించిన కలెక్టర్ వి.పి.గౌతమ్**



(ఖమ్మంప్రతినిధి-విజయంన్యూస్)

ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రిచే ప్రారంభించుకోనున్న నూతన కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎటువంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ ఏర్పాట్లకు గాను బాధ్యతలు కేటాయించిన జిల్లా అధికారులు తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, ఎవరికి కేటాయించిన పనులను ఆయా జిల్లా అధికారులు ముందస్తుగానే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, ఆర్. అండ్.బి శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు శ్యాప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి. అప్పారావు, మిషన్ భగీరథ ఇ. ఇ పుష్పలత, ఇ.డి ఎస్సీ కార్పోరేషన్ ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.కిషన్ రావు, జిల్లా ఉపాధికల్పనాధికారి కె.శ్రీరామ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా?మాలతి, బి.సి. వెల్ఫేర్ అధికారి జ్యోతి, ఉద్యానవన శాఖ అధికారి అనసూయ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఎస్.ఇ ట్రాన్స్కో సురేందర్, ఆర్.డి.ఓలు రవీంద్రనాద్, సూర్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మేరు కులం అభివృద్ధి చెందాలి

**మేరు సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించిన మేయర్ పూనకోలు నీరజ**

ఖమ్మం ప్రతినిధి, జనవరి 12 : విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మేరు కులం అభివృద్ధి చెందాలని ఖమ్మం నగర మేయర్ పూనకోలు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా మేరు కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ 2023ను నగర మేయర్ పూనకోలు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కమర్తపు మురళి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేరు కుల సంఘం ఐకమత్యంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మేరు సంఘం హడాక్ కమిటీ చీఫ్ అడ్వైజర్ సోమ వీరభద్రం, ఖమ్మం జిల్లా కన్వీనర్ నిమ్మల వెంకటేశ్వరావు, కో-కన్వీనర్ వాడపల్లి బిక్షపతి, కో-కన్వీనర్ బొడ్డు హరిగోపాల్, చంద్రమౌళి, వెన్ను వెంకటేశ్వరావు, ఆత్మకూరి కోటేశ్వరావు, తెంబురేణి నరసింహారావు, కీర్తి వెంకన్న, నోముల సత్యనారాయణ, కీర్తి వెంకటేశ్వర్లు, కోనుగంటి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



## బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలంటే అందరు చదవాలి



(కూసుమంచి-విజయంన్యూస్)

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు.. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు సీఆర్పీలు ఓఎస్సీ( ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) సర్వే చేపట్టారు. గురువారం సర్వేలో భాగంగా కూసుమంచి కాంప్లెక్స్ పరిధిలో తుర్కగూడెం రోడ్డులో ఉన్న ఇటుక బట్టీల వద్దకు వెళ్లి బడికి వెళ్లకుండా ఉన్న పిల్లల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు ఇటుక బట్టీ కార్మికులకు అవగాహన కల్పించారు.6%--% 19 ఏళ్ల లోపు పిల్లల చదువులు ఆగిపోవద్దని తెలిపారు. రెండు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు ఉంటే వారిని అంగన్ వాడీలో చేర్పించాలని సూచించారు. కూసుమంచిలో మధ్యలో బడి మానేసి విద్యార్థి ఇంటికి వెళ్లి వాళ్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీఆర్పీలు వద్ల మూడి వెంకటేశ్వర్లు, ఎస్కే జాఫర్ పాల్గొన్నారు.

## ఖానాపురంలో ఫర్నిచర్ షాప్ దగ్ధం

**పరామర్శించిన స్థానిక కార్పొరేటర్ జ్యోతి రెడ్డి, స్థానిక నాయకులు రాంబాబు**



ఖమ్మం: ఖానాపురం హవేలీ లోని ఖానాపురం సెంటర్ నందు కలిగిన వుడ్స్ ఫర్నిచర్ సోఫాలో తయారి సాట్ సర్కిల్ వల్ల పూర్తిగా దగ్ధమైనది. పుట్టగోల దినేష్ అనే యువకుడు నూతనంగా బ్రతుకు నిమిత్తమై 50 లక్షలు లోన్ తీసుకొని ఫర్నిచర్ ఇండస్ట్రీ తయారు చేశాడు . మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాలకు షార్ట్ సర్క్యూట్ సంభవించి షాపు పూర్తిగా దగ్ధం కావడం వల్ల ఓనర్ దిగ్రంథితికి గురయ్యాడు.. ఫైర్ ఇంజన్ సకాలంలో రావటం వల్ల చుట్టుపక్కల షాపులకు ప్రమాదం తప్పింది.. సంఘటన స్థలానికి స్థానిక కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి గారు పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు..బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పోడకంటి రాంబాబు గారు షాపు పైనుంచి కరెంటు తీగలు పోవడం వల్ల దాని ద్వారానే షార్ట్ సర్క్యూట్ జరిగింది అని అందుకు పవర్ డిపార్ట్మెంట్ వాళ్ళ బాధ్యత వహించాలని అన్నారు.. యాదవ్ సంగం నాయకులు లిక్కీ కృష్ణారావు, బి డి ఎస్ ఎఫ్ చంద్రశ్రీ, నాగమణి ,రమ్య తదిరులు బాధను వ్యక్తపరిచారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

(ఖమ్మం-విజయంన్యూస్)

తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షులు కూరపాటి వెంకటేశ్వర్లు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి వేడుకను జరిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుత్తా సీతయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగండ్ల మురళి, నగర ప్రధాన కార్యదర్శి ప్యారిస్ వెంకన్న, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్నం జేమ్స్, డివిజన్ అధ్యక్షులు చింతనిప్పు నాగేశ్వరావు, చింతకాని మండల అద్యక్షులు నున్నా తాజుద్దీన్, పాల్గొన్నారు.



# హిడ్మా చనిపోలేదు

- తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం
-గగనతల దాడులు హేయం
-సరిహద్దు ల్లో సీఆర్పీఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్ మోహరిస్తున్నారు
-ఆదివాసీలపై దాడులకు దిగుతుండటం హేయమైన చర్య
-దేశ సంపద దోచుకుపోయేందుకు దారులు
సుగమం చేస్తున్న పాలకులు -లేఖలో తీవ్రంగా ధ్వజమెత్తిన భద్రాద్రికొత్తగూడెం మావోయిస్ట్ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి అజాద్



(భద్రాద్రికొత్తగూడెం-విజయంన్యూస్)
చత్తీస్ ఘడ్ సరిహద్దుల్లో బుధవారం జరిగిన సర్జికల్ స్ట్రైక్ లో మావోయిస్టు నేత బెటాలియన్ కమాం డర్ కామ్రేడ్ హీడ్మా మరణించినట్లు ఇరు రాష్ట్రాల పోలీసులు దేశం అంతా ప్రచారం చేసుకోవడం దారుణమని, ఆ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్) కార్యదర్శి అజాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక లేఖను మీడియాకు విడుదల చేశారు. దాడులు చేసింది నిజమే కానీ వాళ్ళు అనుకున్న లక్ష్యం నెరవేరలేదన్నారు. దాడికి మాప్రజా గెరిల్లా సైన్యం (పీఎల్జీఏ) గట్టి సమాధానం ఇచ్చిందని, నిజంగా దేశ ప్రజలపై ఈ దేశంలో ఉన్న సైన్యం దాడి చేయడం తిరిగి ఆ దాడులను సమర్థిం చుకోవడం, దాన్ని గోప్పగా ప్రచారం చేసుకోవడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందన్నారు. దేశ భద్రత కోసం దేశాల సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యం ఛత్తీస్ఘఢ్ అడవుల్లో ప్రతి నాలుగు ఊళ్ళ కు ఒక క్యాంపు పెట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. నిత్యం ఇనుప బూట్ల పదఘట్టనలో ఆదివాసీలు నలిగిపోతున్నారని ఆరోపించారు. ఈ దేశంలో అత్యంత విలువైన సంపద ప్రస్తుతం ఛత్తీస్ఘఢ్ దండకారణ్యంలో ఉందని, అనేక రకాల ఖనిజాలు, అటవీ సంపద కొల్లగొట్టేందుకు బహులజాతీ కంపెనీలు పన్నాగం పన్నాయని అన్నారు. . మిగతా ప్రాంతాల్లో లాగా ఇక్కడ సంపద దోచుకుపోయేందుకు వీలుపడటం లేదని, ఆదివాసీలను నిత్యం చైతన్యం చేస్తూ వారి సంపద వారికే దక్కాలని మావోయిస్టు పార్టీ కోరుతుందన్నారు. ఇది పాలకులకు మింగుడు పడటంలేదని, అందుకు మావోయిస్టు పార్టీని ధ్వంసం చేసేందుకు శతవిధాల కుట్రలకు పూనుకుంటుందని ఆరోపించారు. మొత్తం ఛత్తీస్ఘఢ్ రాష్ట్రాన్ని పోలీసు క్యాంపుగా మార్చింద,ఆకుపచ్చ అడవిలో నెత్తుటేరులు పారించేందుకు నిత్యందాడులు చేస్తుందన్నారు. ఆఖరికి వైమానిక దాడులు చేస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని, ఇప్ప టికే అనేక మార్లు వైమానిక దాడులకు పూనుకుంది, అనేక సార్లు గ్రామాలపై మోటార్ సెల్స్ వేసిందని, వీటన్నిటిని ప్రజలు గమనించాలని, మావోయిస్టు పార్టీని ప్రజల నుంచి వేరు చేసేందుకు సామధాన బేధదండోపాయాలను వెంచుకుందన్నారు. ఇలాంటి దాడులను ఖండించాలని పిలుపునిస్తున్నాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోడీ, అమిత్ షా లు ఇద్దరూ సామ్రాజ్య వాద ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. దేశంలో రాజ్యంగ హక్కు లను హరించివేస్తున్నారు. ప్రశ్నిం చే హక్కు, జీవించే హక్కు లను కాలరాస్తున్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో ఉండేందుకు వీలు కలిగేలా చట్టాలను చేస్తున్నారు. సమాధాన్ ప్రహార్ దాడులను ఖండించండి. దేశ ప్రజలపై వైమానిక దాడులు చేయడం హేయమైన చర్య. ప్రజలారా మేల్కొ నండి, దేశ సపద కాపాడుకునేందుకు పోరాటాలు చేయండి. గ్రీన్ హంట్ కు వ్యతిరేకం గా పోరాడండి. దండకారణ్యం లో ఏర్పాటు చేసిన సైన్యాన్ని తక్షణం ఉపసం హరించాలి. ప్రజా గెరిల్లా సైన్యం వర్థిల్లాలి.

## న్యాయవాద దంపతులపై దాడిని ఖండించండి



(ఖమ్మం-విజయంన్యూస్)
క్రిస్టఫర్, అనురాధ న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ గోడపత్రిక ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది సిపిఐ నాయకుడు కర్నాటి భాను ప్రసాద్ అతని అనుచర గుండాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నిందితులకు కొమ్ము కాస్తున్న పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నీ పటిష్టంగా అమలుపరచాలని డిమాండ్ చేస్తున్నాం దళిత బహుజనులపై ఆధిపత్య కులాలు చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు దాడి జరిగి 20 రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం అమానుషం అన్నారు. గుంతెటి వీరభద్రం, డాక్టర్ కేవీ కృష్ణారావు,పెరుగు వెంకటరమణ, పద్మాచారి, పాల్వంచ రామారావు లిక్కి కృష్ణారావు, భద్ర నాయక్, డి విజయ్, బాసటి హనుమంతరావు, కొరుపల్లి శ్రీనివాస్ ఎస్కే నజీమా,కొట్టే సుధాకర్, దాసరి శ్రీను, అబ్దుల్ రహమాన్, ఉపేంద్ర, అఖిల్, శ్రీనివాస్ నాయక్, సీతారాం నాయక్, జింగిపల్లి రవి, కామ ప్రభాకర్, చింతమల వెంకటేశ్వర్లు, గాదరి బాబు, నునావత్ హరి సింగ్, రవీందర్ నాయక్, రామారావు కె రామారావు, టీ రమేష్ తదితరులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.

# కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం...

మోడీ విధానాలతో రైతాంగానికి తీవ్ర నష్టం..
ప్రతి గ్రామంలో రైతు సంఘం ఏర్పాటు చేయాలి..
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు
పోతినేని సుదర్శన్ రావు



(కూసుమంచి-విజయంన్యూస్)
దేశంలో మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని, కేంద్రం తీసుకువచ్చి రైతాంగ వ్యతిరేక విధానాలు రైతన్నలను నెట్టేట ముంచే విధంగా ఉన్నాయని, మోడీ విధానాలు దేశానికే నష్టదాయకమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు విమర్శించారు. గురువారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల రైతు శిక్షణ తరగతులు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేశంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యంగా వ్యవసాయాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించి రైతులను దివాల తీసే కార్యక్రమాలను పెట్టుకున్నడని, కార్పొరేట్ శక్తులకు రైతు చేతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని కార్పోరేట్ శక్తులకు అప్పచెబుతున్నారని రైతులను రోడ్డున పడేయాలని కుట్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. అలాగే రైతాంగ సమస్యలు పరిష్కారానికి రైతులందరూ ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలని, ప్రతి గ్రామంలో రైతు సంఘాలు ఏర్పాటు చేసి రైతన్నల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. ఈనెల 26వ తారీఖున రైతంగ పోరాటాలకు మద్దతుగా భారీ ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ జిల్లా కేంద్రంలో నిర్వహించాలని ఈ ర్యాలీకి భారీ ఎత్తున రైతులు రావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం మండల అధ్యక్షులు తోటకూరి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొంతు రాంబాబు ,మాదినేని రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు గొడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్, కొండపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు రచ్చ నరసింహారావు, ఇంటూరి అశోక్ , రైతు సంఘం జిల్లా నాయకులు యడవల్లి రమణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలం గురుమూర్తి, మండల అధ్యక్ష కార్యదర్శులు మూడు గన్య నాయక్, చిట్టూరి వెంకటేశ్వర్లు, రెండు మండల రైతులు పాల్గొన్నారు.

## శ్రీ రామకృష్ణ విద్యాలయంలో సాంప్రదాయాల సంక్రాంతి ‘

(ఖమ్మం,రఘునాథపాలెం-విజయంన్యూస్)
ఆధునికత మోజులో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోతున్న నేటి తరానికి,మన సంస్కృతే మన ఆత్మగౌరవం అని చాటి చెప్పే విధంగా స్థానిక ఖమ్మం శ్రీరామకృష్ణ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయిఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్య సంతోష గౌతమ్ మరియు పాఠశాల సెక్రెటరీ శ్రీనివాస్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రధానాచార్య సంతోష గౌతమ్ మాట్లాడుతూ మన సాంస్కృతిక విలువలే మన పూర్వికులు మనకిచ్చిన విలువైన ఆస్తి అని, వాటిని మనం మన తరువాత తరాలకు తెలియచేయటం మన భాద్యత చెప్పారు. ఇంకా కార్యక్రమంలో మన సంప్రదాయాన్ని నేటి విద్యార్థులకు పరిచయం చేస్తూ సంప్రదాయ గంగిరెద్దు మేళం, పతంగులు ఎగరవేత, మోదుగు ఆకుల్లో సహపంక్తి భోజనం, చిన్నారుల సాంప్రదాయ వేషధారణలు మరియు వారి ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి..



## గ్లోబల్ రెయిన్బో పాఠశాలల విద్యార్థుల విజ్ఞానవిహారయాత్ర

(కూసుమంచి-విజయంన్యూస్)
కూసుమంచి మండల కేంద్రంలో గల గ్లోబల్ రెయిన్బో పాఠశాల విద్యార్థులు నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలోని జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న గాంధీ గుడిని హైదరాబాదులోని వండర్లా కు విజ్ఞానవిహారయాత్రకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎండి.ఏర్షద్ అహ్మద్ మాట్లాడుతూ గాంధీ గుడిలో జ్ఞాన మందిరము, గాంధీ రాసిన సూక్తులు గాంధీ జీవిత విశేషాలు కురాను బైబిలు భగవద్గీత పుస్తకాలను 27 రకాల పుణ్యక్షేత్రాలు మట్టిని దర్శించి గాంధీ మంచి స్ఫూర్తిని పొందవచ్చు అని కార్యక్రమం వలన విద్యార్థులకు విషయ అవగాహన , దేశ నాయకుల జీవిత విషయాల నుంచి అవగాహన కలుగుతాయని మరియు విహారయాత్ర వలనఎంతో ఆహ్లాదము, ఆనందము ,మానసిక వికాసము కలుగుతాయని తెలిపారు, ఈ వండర్లాలో విద్యార్థులు ముఖ్యంగా అంతరిక్షం కు వెళ్లి వచ్చిన అనుభూతి నీ కలుగుతుందని తెలియజేశారు ఈ ట్రిప్పులో పాఠశాల బాధ్యులు ఎండి ఏర్షద్అహ్మద్, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, పాఠశాల ఇంచార్జ్ జాహ్నవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు




ఖాళీల వివరాలు :
ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్, ఖమ్మం ఆర్‌సి ఇన్‌చార్జ్, ఖమ్మం నగరం,కార్పొ రేషన్, క్రైమ్, ఎడ్యుకేషన్.
పాలేరు నేలకొండపల్లి, ఖమ్మం రూరల్. తిరుమలాయపాలెం
మధిర ముదిగొండ, బోనకల్, చింతకాని, మధిర టౌన్, మధిర ఆర్‌సి ఇన్‌చార్జ్. ఎర్రుపాలెం
సత్తుపల్లి వేంసూర్,
వైరా వైరా టౌన్,సుజాత నగర్, కొణిజర్ల, కారేపల్లి.
www.epaper.vijayamdaily.com
విజయం
అక్షర సమరానికి నాంది
విలేకర్లు కావలెను
సమాజం, స్థానిక రాజకీయ అంశాలపట్ల కనీసం అవగాహ కలిగి ఉండి చక్కని రాత, ఓర్పు , నేర్పు గల జర్నలిస్టులకు విజయం తెలుగు దిన పత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాత్రికేయులుగా ప్రతిభను చాటేందుకు అసక్తి గల వారు సంప్రదించగలరు.
సంప్రదించాల్సిన నెంబర్: 99129 63565.